సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,28 జూన్ 2024


# ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు అందించండి




**– పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**

**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం మండలంలోని ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు అందించడంలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చూసుకోవాలని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన పి. గన్నవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన ఆర్డబ్ల్యూఎస్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టవలసిన చర్యలు, ప్రజలకు సురక్షిత త్రాగునీరు పంపిణీ, గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి గ్రామంలో ఏ సమస్య ఉన్న తను దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాలలో సురక్షిత త్రాగునీరు కాలుష్యానికి గురికాకుండా చూడాలని, అదేవిధంగా ఎవరైనా సీజనల్ వ్యాధుల బారిన పడితే వారికి వెంటనే వైద్య సదుపాయాలు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలు గ్రామాలలో ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించడం ద్వారా సీజనల్ వ్యాధులను తొలి దశలోనే గుర్తించవచ్చు అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా గ్రామపంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం మండల తహసిల్దార్ హుస్సేన్, ఎంపీడీవో త్రిశూలపాణి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగా దేవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూర్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, జే.ఈ కళ్యాణ చక్రవర్తి, వైద్యరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.





# జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమిషనర్,అధికారులు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :**

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్‌సగిలిని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు,ఇతర అధికా రులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాధిపతులతో కలిసి కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.కలెక్టర్‌ను కలిసినవారిలో కాకినాడ నగర పాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసు బాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్‌సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. వెంకట రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ,ఈఈ మాధవి, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.







# డయేరియా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు

**– జిల్లా కలెక్టర్ షాన్ మోహన్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో డయేరియా వ్యాధి పట్ల ప్రజలెవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, డయేరియా నియంత్రణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలతో పాటు వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో మంచి నీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. తాగునీరు పైపులైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మత్తుల పనులు చేపట్టామని కలెక్టర్ అన్నారు. మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం రోజుకు రెండుసార్లు చొప్పున సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, జిల్లాలోని అన్ని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఐరన్ టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఇంటింటికి సర్వే నిర్వహించి ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటే వారిని గుర్తించి వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు.కొన్నిచోట్ల డయేరియా అనుమానం కేసులను ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని వారికి ఎటువంటి ప్రమాదం లేదని, ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే వారిని ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. అదేవిధంగా డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన వేడి నీళ్లు మాత్రమే తీసుకోవాలని, ఇంటిలోనూ, పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవడం తోపాటు మంచినీటి నిల్వచేసే బిందెలు, డ్రమ్ములను కూడా శుభ్రం చేసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి సూచించారు.

## అందరికీ అందుబాటు ధరలలో ఆధునిక వైద్య పరీక్షలు - డా॥ బాదం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అత్యాధునిక వైద్య పరీక్షలు నామ మాత్రపు రుసుముతో అందరికీ అందించాలన్న ఆశయంతో బాదం బాలకృష్ణ క్లినికల్ లాబ్ ఏర్పాటు చేసామని, గతపది మాసాలు గా విశేషస్పందన వచ్చిందని లాబ్ కమిటి చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. గురువారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడుతూ ఇదే ప్రాంగణంలో పదిహేను రకాల వైద్య పరీక్షలను అందించడమే కాక ప్రజల సౌకర్యార్థం ఒ.పి.వైద్య సేవలు కేవలం యాభై రూపాయల నామమాత్రపు రుసుముతో నిష్ణాతులైన వైద్యుల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజి, ఇ.ఎన్.టి. మొదలైన వైద్య సేవలను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేసారు. ప్రస్తుత కాలంలో వైద్య పరీక్షలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారందరినీ దృష్టిలో పెట్టుకుని ప్రముఖుల విరాళాల సేకరణ ద్వారా నిర్మించిన ఈ లాబ్‌లో ప్రజాసేవయే పరమావధిగా తమ బృందం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేసారు.

వైద్య పరీక్షలకు అవసరమైన అన్ని ఆధునిక హంగులను ఏర్పాటు చేయడమే కాక నిష్ణాతులైన సాంకేతిక సిబ్బందితో ఆధునిక వైద్య పరికరాల సహాయంతో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ కోసం ఇంటి వద్దే సాంపిల్ సేకరణ విభాగం ప్రారంభించడం జరిగిందని, 95053 54448లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు. లాభాపేక్ష లేని స్వచ్ఛంద సేవాసంస్థగా డా॥ బాదం బాలకృష్ణ క్లినికల్ లాబ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు.

## 1కోటీ 65 లక్షల అక్రమ మద్యం ధ్వంసం




**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** సాధారణ ఎన్నికల 2024 ఎన్నికల నియమావళి అమలు సమయంలో పోలీసులు దాడుల నిర్వహించి స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యంను గురువారం కాకినాడ రూరల్ మండలం సూర్యరావుపేట గ్రామంలోని న్యూ ఎన్టీఆర్ బీచ్ ఎదురుగా రోడ్లు భవనాలు అతిథి గృహం వద్ద ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ స్వీయ పర్యవేక్షణలో కాకినాడ జిల్లా పరిధిలో ఉన్న సెబ్ స్టేషన్లు, శాంతిభద్రతల పోలీస్ స్టేషన్ల సంబంధించిన, 2024 ఎలక్షన్ పీరియడ్‌లో స్వాధీన పర్చుకున్న అక్రమ మద్యం, నాటు సారాలను ధ్వంసం చేశారు. ఇందులో 1406 కేసులలో (ఐడి, ఎండిపిఎల్, డిపిఎల్) నమోదు చేయబడిన 32,040.475 లీటర్ల సుమారు రూ.1,65,69,000లు విలువచేసే అక్రమ మద్యం, నాటు సారాను ధ్వంసం చేశారు

కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి,సెబ్ సూపరింటెండెంట్ జె.రవికుమార్,అసిస్టెంట్‌సెబ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీరంగం దొర,కాకినాడ జిల్లాకుచెందిన సెబ్,పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీ భద్రత మా అందరీ బాధ్యత..

**– నాయకులు ఎప్పుడు అందుబాటులో ఉంటారు**
**– నగరంలో బ్లేడు బ్యాచ్ గంజాయి బ్యాచ్ లేకుండా అరికడదాం**
**– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** మీ భద్రత మా బాధ్యతా అనే విధానంలో కూటమిప్రభుత్వంసుపరిపాలన అందించే దిశలో అడుగులు వెయ్యడం లక్ష్యంగా పనిచేస్తామని నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక అదేమ్మ దిబ్బ వాంబే గృహాల వద్ద స్థానిక మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన మీ భద్రత మా బాధ్యతా అనే కార్యక్రమనికి శాసనసభ్యులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, మీ పిల్లల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వానికి మహిళలు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చి గెలిపించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇంటింటికీ తిరిగి నప్పుడు మహిళలు పిల్లల భవిష్యత్ కోసం కోరడం జరిగిందని, అదే అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగిందని తెలిపారు. ఆదిశలో అడుగులు వేస్తూ, మీ భద్రత మా బాధ్యతాఅనేకార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. మీ భద్రత కల్పించడంలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి, ఆకతాయిల ఆగడాలు అరికట్టడం వంటి అనేక అంశాలుముడిపడిఉన్నట్లుశ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విషయములో ఎన్‌డిఎ కూటమి స్పష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాడుచెప్పాం,నేడుఆచరణ దిశలో అడుగులు వెయ్యడం జరుగుతున్నట్లు తెలియచేశారు. ఆకతాయిలచెసేఅనేక ఆగడాలు,పిల్లల్ని ప్రలోభ పెడుతున్న అనేక ఘటనలు మహిళలు మాదృష్టికి తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. మహిళల ఆశీర్వచనం వల్లనే అధిక మెజార్టీతో గెలుపొందడం జరిగిందని,వారికిఎన్నికలప్రచార సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి వారికి అన్నివిధాలుగా భరోసాగా, భద్రత కల్పించడం మా బాధ్యతా అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలియ చేశారు.ఆగడాలను అరికట్టే చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో సమాజంలో చైతన్యం తీసుకొని రావడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మీకు ఎటువంటి సమస్య వచ్చిన నాయకులు అందుబాటులో ఉంటారని,వారు సరిగ్గా స్పందించక పోతే నేరుగా నా నెంబర్ 8693934567కు ఫోన్ చేయవచ్చు అని ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలియచేశారు. కేవలం క్షేమ సమాచారాలు కోసం కాకుండా ఇబ్బందులు ఎదురవుతే ఫోన్‌చేయవచ్చు అని స్పష్టం చేశారు. అటువంటి ఆకతాయిల వివరాలు తెలియ చేసే పోలీసులు ద్వారా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అటుఆకతాయి వివరాలు తెలియ చేస్తూ, బాధ్యత మీరుతీసుకుంటే వారి ఆటకట్టే బాధ్యత మేము తీసుకుంటామని మహిళలహర్షధ్వానలమధ్యఆదిరెడ్డి వాసు ప్రకటించారు. ఈకార్యక్రమంలోసిఐ,పోలీసు అధికారులు, నాయకులు,మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు 3వేలు కలుపుకొని..
## జూలై 1 తేదీన రు.7వేల రూపాయలు లబ్ధిదారులు పెన్షన్ అందజేయనున్నాం

**– ప్రభుత్వం విధి విధానాలను క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందించవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉంది**
**– రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోని అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.గురువారం స్థానిక యార్నగూడెం రోడ్‌లో గల ఆనంద్ ఇన్ ఫంక్షన్ హాల్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల తీరుపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరిచే విధాన నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందించవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరును తెచ్చే బాధ్యతమనపై ఉందన్నారు.రాజకీయంగాబేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంతీసుకున్న నిర్ణయాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించవచ్చునని అన్నారు.అందుకు ఉదాహరణ నేడుగతప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు అందించవలసిన విద్యాకిట్స్‌నురాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిర్ణయంతో అందించడం జరుగుతుందన్నారు.ఒక భావజాలానికి అలవాటు పడిన అధికారులు,ఉద్యోగులు అది విడనాడి ప్రస్తుత ప్రభుత్వంఅందించే విధివిధానాలు ద్వారా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అమలు అందించాలన్నారు. జులై మాసం నుండి అర్హులైన వృద్ధాప్య వితంతు వికలాంగు పెన్షనర్లు అందరికీ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు జులై మాసం నుంచి రు.4వేల రూపాయలు, గత ఏప్రిల్ నుండి మూడు మాసములకు ఒక్కొక్క వెయ్యి చొప్పున మొత్తం రు.7వేలరూపాయలులబ్ధిదారులకుఅందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వపై ఆర్థికభారంపెద్ద మొత్తంలో పడినప్పటికీ లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్స్ అందించడం మంచి నిర్ణయం అన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయఉద్యోగులులబ్ధిదారులు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మండలంలో అమలు వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, సంక్షేమ పథకాలు, వివిధ రకాల. పించన్లు అమలుపైసమీక్షించారు.ఈసమీక్షసమావేశంలో మాజీశాసన సభ్యులుబూరుగుపల్లి శేషారావు,మున్సిపల్ కమిషనర్, టి.రాం భూపాల్ రెడ్డి, టి.ట్కో ఎస్.ఈ, బి.శ్రీనివాసరావు, తాహిసిల్దార్,వి.నాగ భూషణం, ఎంపీడీవో జేఏ.ఝాన్సీ, గృహ నిర్మాణ శాఖ ఈ.ఈ, పరుశురాం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉసులుమర్రులో జల్జీవన్ మిషన్ పనులు ప్రారంభం

**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఉసులుమర్రు గ్రామ పంచాయతీ ఏరియాలో జూన్ 27వ తేదీ గురువారం జల జీవన్ పథకం ద్వారా సుమారు 74.60 లక్షల రూపాయలతో మంజూరైన జల్జీవన్ పథకం పనులు ఊసులుమర్రు గ్రామ సర్పంచ్ వీరమళ్ళ నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తులాజాన్ ప్రసాద్ వీరమల్ల రామకృష్ణ మరియు వార్డ్ మెంబర్స్ పాల్గొనడం జరిగింది.

## అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వివిధ శాఖల్లో అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్..జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీ, జిల్లా పరిషత్తు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల సేకరణ, జిల్లాలో అన్ని మండలాలు, జిల్లా పరిషత్ వారిగా 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టిన పనులు, ఖర్చులు వాటి వివరాలు, ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య, అమృత్ సరోవర్ పనుల వివరాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్.. అధికారులతో సమీక్షించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలు, జిల్లా పరిషత్ వారిగా 15వ ఆర్థిక సంఘం,సాధారణ నిధులతో చేపట్టిన పనులు, ఖర్చులు వాటి వివరాలను ఈ నెలాఖరులోగా సమర్పించాలన్నారు. ప్రాముఖ్యంగా జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో అవసరమైన పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం పని దినాల సంఖ్య కనుగుణంగా పనులలో పురోగతి కనబర్చాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీపీవో కె.భారతి సౌజన్య, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో జీఎస్.రామ్ గోపాల్, ఉద్యాన శాఖ అధికారి మల్లిఖార్జునరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు, పంచాయతీరాజ్ ఈఈ జి.మల్లిఖార్జున, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల పనుల పురోగతిపై సమావేశం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో జాతీయ రహదారుల పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి..ఎస్ రామ్ సుందర్ రెడ్డి, రెవెన్యూ, రోడ్డు భవనాలు, ఎన్‌ఎచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ నుంచి రాజమండ్రి వరకు నిర్మించే రహదారి, వాకలపూడి నుంచి అన్నవరం, కత్తిపూడి నుంచి అమలాపురం వరకు నిర్మిస్తున్న రహదారుల నిమిత్తం చేపట్టిన భూసేకరణ పనులు, నిర్మాణ దశలో ఉన్న రహదారుల ప్రస్తుత పరిస్థితిని ఎన్‌ఎచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణ సమస్యలు అధిగమించే విధంగా ఎన్‌ఎచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ, సర్వే సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు.సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే. సీతారామరావు, రోడ్డు భవనాల, ఎన్‌ఎచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి చిన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అమలాపురం మండలం ఈదరపల్లి గ్రామంలో జనసేన నాయకులు చింతపల్లి చిన్న అధ్వర్యంలో అమలాపురం టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసారు. అనంతరం నాయకులు అందరూ ఎమ్మెల్యే ఆనందరావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కేటింగ్ రింక్ కోసం వేలం పాట

**- రూ. 21.75 లక్షలకు ఖరారు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్ నిర్వహణ కోసం గురువారం వేలంపాట నిర్వహించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో స్మార్ట్ సిటీ సీఈవో, ఎండి నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు సమక్షంలో జరిగిన పాటలో అయిదుగురు పాల్గొన్నారు. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తరపున వేసిన రూ.21.75 లక్షల అత్యధిక టెండర్‌ను ఖరారు చేశారు. ఏడాది పాటు నిర్వహణ కోసం ఈ టెండర్ పిలిచారు. స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వెంకటరావు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారు.

# జూలై 1న ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ

## - జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జూలై 1న ఎన్టీఆర్ భరోసా ఫించన్ పంపిణీకి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి.. జిల్లా గ్రామీణ అభివృద్ధి(డీఆర్డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులతో సమావేశం నిర్వహించారు. జూలై నెలలో చేపట్టబోయే ఎన్టీఆర్ భరోసా ఫించను పంపిణీ ప్రణాళిక, చంద్రన్న బీమా క్లెయిమ్స్ పరిష్కారం, స్త్రీ నిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసిన రుణాలు వివరాలు, స్వయం సహాయక సంఘాలు, సభ్యులకు స్వయం ఉపాధి నిమిత్తం కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు.

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను రానున్న జూలై నెల నుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనున్నదన్నారు. జూన్ నెలలో సామాజిక భద్రత పింఛన్ల కింద జిల్లాలో 2,79,805 మందికి రూ.82.90 కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్టీఆర్ భరోసా పేరుతో



17 రకాల పింఛన్లు జిల్లాలో 2,79,319 మందికి రూ188.40 కోట్ల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మూడు వేలు, నూతనంగా పెంచిన ఫించన్ సొమ్ము నాలుగు వేలుతో కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై 1న గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో ఫించన్ సొమ్ము సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకు కిందిస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు తెలియజేసి, సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో 39,532 స్వయం సహాయక సంఘాల్లో 4.08 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని ఆయన తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేసే స్త్రీనిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసే రుణాలు, రికవరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు స్వయం ఉపాధి మార్గాలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీరమణి, పట్టణ ప్రజలకు నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద, డీపీఎంలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అమరావతి సీఎస్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరాబ్ కుమార్ ప్రసాద్.. జూలై 1న నిర్వహించే ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి హాజరైయ్యారు.

## కొండయ్యకు ఎంప్లాయిస్ అవార్డు బహూకరణ




**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** డా.వై.ఎస్.ఆర్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అంబాజీపేటలో పనిచేస్తున్న పెనుగొండ మాలకొండయ్యకు మెరిటోరియస్ ఎంప్లాయిస్ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డా.తోలేటి జానకీరామ్ అందచేశారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లి గూడెం సమీపంలో ఉన్న వెంకట రామన్న గూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొండయ్యకు అవార్డును బహుకరించారని స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర ఇంచార్జి అధిపతి డా.వి.గోవర్ధన్ రావు తెలిపారు. కొబ్బరి పరిశోధనా కేంద్రం విస్తరణాధికారిగా కొండయ్య చేసిన సేవలకు ప్రతి ఫలంగా ఈఅవార్డు కింద రూ.2,500 నగదు, ప్రశంసా పత్రం బహుకరించారని గోవర్ధన్ రావు తెలిపారు. కొండయ్యకు అవార్డు లభించిడంపట్ల ఇంచార్జి అధిపతి డా.గోవర్ధన్ రావు, శాస్త్రవేత్తలు బి.నీరజ, డా.వి.అనూష,ఎ.కిరీటి తదితరులు అభినందించారు.

## ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర మంత్రి సుభాష్ హాస్పటల్లో పలు రికార్డులను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న అన్యాయాల గురించి ఆరా తీశారు. బ్లడ్ టెస్ట్‌లకు పరికరాలు ఉన్నా సరే పేషెంట్లను బయటకు పంపుతున్నారని ఈ విషయంపై వాసంశెట్టి సుభాష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జనరిక్ మెడిసిన్ అత్యధిక రేట్లు అమ్ముతున్నారని తన దృష్టికి వచ్చిందని, అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని డాక్టర్లను, సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మంత్రి వెంట ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్,జనసేననాయకుడు సత్యవాడ శ్రీహరి పంతులు, రవ్వ భూషణం, శ్రీహరి,విశ్వనాధుల ఫణికుమార్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా కంటి వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉదయం 8-00 గంటల నుండి మధ్యాహ్నం 1-00 వరకు నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలియజేసారు. పెదబ్రహ్మదేవం గ్రామంలో గల ప్రజలే కాకుండా పరిసర గ్రామ ప్రాంతాలైన ఇల్లపల్లి,రంగాపురం ,మేడపాడు, మర్రిపూడి, తుమ్మలపల్లి గ్రామాలలో ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేసుకున్నారు. కిరణ్ కంటి ఆసుపత్రి నుంచి 15మంది వైద్య సిబ్బంది పాల్గొన్న ఈ శిబిరంలో సుమారు 200మందికి బి.పి., షుగరు, కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరమైన 40మందిని సోమవారం బస్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. సమితి సభ్యుడు తన సోదరుడు టివివి సత్యనారాయణ 50 వ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిబిరాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సర్పంచ్ నీల పాల సత్యనారాయణ, సోసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, టి.డి.పి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పంచాయితీ సభ్యురాలు తోటకూర దుర్గా లక్ష్మీ,సేవా సమితి కార్యదర్శి వింజమూరివిశ్వనాథం,సభ్యులు టి.వి.వి.సత్యనారాయణ, నువ్వుల వెంకట్రాజు, తోట వెంకట రమణ, సూర్యచంద్రరావు, బాబ్జి, తెలుగుంట్ల నరసింహారావు, తోటకూర సూర్య ప్రభాకరరావు, ఆచంట వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు. టివివికి సమితి సభ్యులు, బంధువులు స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సునీత విద్యార్థులకు సూచించారు. డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా అనే అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే వాటిపై పూర్తి అవగాహన పెంపొందిం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది స్వార్థపరుల ధనాపేక్ష కోసం యువతను పెడదోవ పట్టిస్తూ వారికి మత్తు పదార్థాలు అలవాటు చేసి బానిసలుగా మారుస్తున్నారన్నారు.

విద్యార్థులు అప్రమత్తతతో మెలిగి వాటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాధవి ద్రవ్యాలు మత్తుపదార్థాలు గంజాయి వంటివి ప్రమాదకరమైనవని శరీరంలో నాడీ వ్యవస్థ పై అవి పని చేయడం ద్వారా పూర్తిగా మెదడు అదుపుతపుతుందన్నారు దీనితో తాము ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితిలో వాళ్లు ప్రవర్తిస్తారని, అలాగే అనేక నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు శ్రీలక్ష్మి సుధీర్, మదీనా ఎన్సిసి అధ్యాపకులు ప్రయోగమూర్తిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దాపురం డివిజన్‌లో వర్షపాతం వివరాలు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాలలో గురువారం ఉదయం నమోదైన వర్షపాతాల వివరాలు. కోటనందూ మండలం 7.6 మి.మీ., తుని 5.8 మి.మీ., రౌతులపూడి 5.4 మి.మీ., శంఖవరం 7.4 మి.మీ., ఏలేశ్వరం 5.6 మి.మీ., జగ్గంపేట 3.6మి.మీ., కిర్లంపూడి 4.2 మి.మీ., ప్రత్తిపాడు 4.0 మి.మీ., తొండంగి 10.2 మి.మీ., పెద్దాపురం 5.4 మి.మీ., గండేపల్లి 7.0 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# కబ్జా కోరల్లో ఏటిగట్లు





**- అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోని హెడ్ వర్క్స్ అధికారులు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రైతు పండించిన పంటలు మార్కెట్ కు తరలించుకునేందుకు, వరదల సమయంలో రక్షణకు కాటన్ మహాశయుడు ఏర్పరచిన ఏటిగట్లు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నాయి. ఏటిగట్లు ఆక్రమించుకుని పశువుల పాకలు ఏర్పాటు చేసుకోవడంతో ఏటిగట్లు బలహీనమై ఎప్పుడు ఎక్కడ గండి పడుతుందో అని గోదావరి ప్రభావిత ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటు జీవనం సాగిస్తున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో ఏటిగట్లను వెడల్పుచేసి ఆధునీకరించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో ఎటుగట్లను ఆక్రమించుకుని పక్కా కట్టడాలు నిర్మిస్తున్నారు. దీంతో ఏటిగట్ల పరిధిలో ఉన్న లంక పంట పొలంలోని పండించిన ఉత్పత్తులను సుదూర ప్రాంతాలు తరలించాలంటే వాహనాలు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం వెంబడే వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు కాలినడకన వెళ్తూ ఉంటారు. ఆత్రేయపురం గౌతమి ఏటిగట్టు వద్ద ఒక వ్యక్తి నివాసముండేందుకు షెడ్డు ఏర్పాటుచేసి ఏటిగట్టుపై ఎవరు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశాడు. దీనిపై హెడ్ వర్క్ అధికారులకు పలువురు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఆక్రమించుకున్న వ్యక్తికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో ఎవరూ నన్ను ఏమి చేయలేరు అనే ధోరణిలో ఆక్రమణదారుడు వ్యవహరిస్తుండడం విస్మయం కలిగిస్తుంది. మండలంలోని గౌతమి వశిష్ట పాయల వెంబడి బొబ్బర్లంక, రాజవరం మొదలుకుని ర్యాలీ వరకు అలాగే బొబ్బర్లంక నుండి ఊబలంక వరకు ఏటిగట్లపై ఉన్న అక్రమ కట్టడాలు పుట్ట గొడుగులు లాగా వెలుస్తూనే ఉన్నాయి. ఇదేమిటని ప్రశ్నించే అధికారులు లేకపోవడంతో ఆక్రమణదారులకు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది. ఇదేమిటని ప్రశ్నించే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడని పరిస్థితి నెలకొంది. అరికట్టాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలగజేసుకుని ఈ అక్రమ కట్టడాలు తొలగించి రైతులకు మేలు చేకూర్చాలని మండల రైతులు కోరుతున్నారు.

# రైతు సంక్షేమమే చంద్రన్న ధ్యేయం

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రైతు సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని, రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలో ఐ.పోలవరం ఆర్.బి. కేంద్రం వద్ద 90శాతం రాయితీపై వరి విత్తనాలు రంపచోడవరం నియోజవర్గం శాసనసభ సభ్యులు మిరియాల శిరీష దేవి భాస్కర్ ఆదేశాలు మేరకు గురువారం పంపిణీ చేయడం జరిగింది.

సందర్భంగా కారం సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి రైతుకి రాయితీపై విత్తనాలు అందించడమే చంద్రన్న ధ్యేయం అని, మండలంలో విత్తన రకాలు ఆర్.జె.ఎల్. -667, ఎం.టి.యు. 1061-267, ఎం.టి.యు. 1064-835, ఎన్.ఎల్.ఆర్. 34449-104, బి.పి.టి. 5204-248, ఎం.టి.యు. 1121-500 మొత్తం = 853.1 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తూ వాతావరణానికి అనుకూలంగా మెరక, గాడి పొలాలకు అనుకూలంగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని, గిరిజన ప్రాంతంలో పండే పంట విలువైనదని ప్రతి రైతు కుటుంబానికి



కావలసిన దాన్యం పొందుపరచుకొని విక్రయించుకోవాలని కారంసురేష్ బాబు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పండా వెంకటలక్ష్మి జడ్పీటీసీ, బంధం శ్రీదేవి ఎంపీపీ, సర్పంచ్ కొంచెం వెంకటలక్ష్మి, మాజీ సర్పంచులు బంధం పోతన్నదొర, కంగాల రామలత, సూరిబాబు, వార్డు మెంబర్ రాజన్న దొర, సీనియర్ నాయకులు చవలం బాపన్న దొర, కుంచం బాపన్న దొర, కంగల అబ్బాయి దొర, ఏడిఏ, ఏవో లక్ష్మణరావు, ఏఈఓ, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 'నేను బడికి పోతా' కార్యక్రమం ప్రారంభించిన

## జిల్లా విద్యాశాఖాధికారిణి కమలకుమారి




**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు పాఠశాలలకు వచ్చే కోరికను కల్పించాల్సిన భాధ్యత ఉపాధ్యాయులదేనని, దానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నేను బడికి పోతా,విద్యాప్రవేశ కార్యమ్రాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాయని అన్నారు. ఈ నెల 6 నుండి జూలై 12 వరకు నెలరోజుల పాటు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి బయట తిరుగుతున్న 6 నుండి 14 ఏళ్ళ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి చైర్మన్‌లు ఆయా గ్రామాల పరిధిలోని పంచాయితీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, సోషల్ వెల్ఫేర్ కమిటీ, పేరెంట్స్ కమిటీ, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు టీంగా ఏర్పడి బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల సహకారంతో బడిలో చేర్పించాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి బడి బయట పిల్లలు లేని గ్రామాలుగా ప్రకటించుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్స్‌తోపాటు విద్యా ప్రోత్సాహాల గురించి పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.ప్రతీ గృహాన్ని సందర్శిచాలని డీఈఓ కమలకుమారి తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంతో పాటు విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ బడులను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అనంతరం నేను బడికి పోతా అవగాహనా ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బి.వి.వి. సుబ్రహ్మణ్యం, ఏపీసీ మధుసూదనరావు, డీవైఈఓకె. సూర్యప్రకాశరావు, ఏపీఓ ఎంఏకె.భీమారావు ఏ.ఎల్.ఎస్.కో-ఆర్డినేటర్ జి.రమేష్,ఎంపీడీఓ జి.సరోవర్, తహశీల్దారు జె.విమలకుమారి, ఎంఈఓ-2మోకాప్రకాష్,ప్రధానోపాధ్యాయులుకె.సాయిరామ్. పి.వి.కేశవాచార్యులు, పంచాయితీ కార్యదర్శులు జి.జి.వి.కె. కుమార్, వి.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరూ బడిలోనే వుండాలి




**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలలోనే వుండాలని మండల విద్యాశాఖాధికారిలు వర ప్రసాదరావు, పాచ్చా సాహెబ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తాడిపూడి, మెర్లపాలెం శివారు వాసంశెట్టి వారిపాలెం, చిన్నంవారి పాలెంశివారు వీరేపల్లి కట్టవ గ్రామ పాఠశాలల పరిధిలో 'నేను బడికి పోతా' కార్య క్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూప్రభుత్వపాఠశాలల్లోచదువుతున్న విద్యార్థులకు అనేక పథకాలు, ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక విద్యా కార్య క్రమాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలోపాఠశాలల ఉపాధ్యాయులు ఎస్.వి.వి.ఎస్.ఎస్. ప్రసాద్, మాణిక్యాలరావు, రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అవంతి ఫౌండేషన్ వారిచే వాటర్ ప్లాంట్ బహుకరణ



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు గ్రామంలో జూన్ 27వ తేదీ గురువారం అవంతి ఫౌండేషన్ వారిచే బహుకరించబడిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించబడింది కానూరు పంచాయతీ ఆఫీస్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన ఈ మంచినీటి వాటర్ ప్లాంట్‌ను దాత అవంతి ఫీడ్స్ లిమిటెడ్ సీఎండీ & అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్‌ను అవంతి ఫౌండేషన్ వారు బహుకరించగా, దానికి కావలసిన షెడ్ నిర్మాణమును గారపాటి గంటన్న కుమారుడు గారపాటి రామ చంద్రరావు నిర్మించారు. ఈ కార్యక్రమంలో కుందుల వీర వెంకట సత్యనారాయణ గ్రామ సర్పంచ్ భావన మధు పూర్ణ చందు, అనపర్తి వెంకట నారాయణ, అనపర్తి సత్యనారాయణ, వైనాట్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు కానూరు గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గున్నారు.

## చెడు, మంచి స్పర్శ, ఎడ్యుకేషన్ చటాలుపై అవగాహన సదస్సు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గురువారం స్థానిక లాలచెరువు మున్సిపల్ హై స్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు చెడు, మంచి స్పర్శ మరియు ఎడ్యుకేషన్ చటాలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు శ్రద్ధగా చదవుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అని అన్నారు, పాఠ్య పుస్తకాలతో పాటు దిన పత్రికలు కూడా చదవాలి అని, పాఠశాలలో ఉన్న గ్రంథాలయాలు ను ఉపయోగించుకోవాలని, తద్వారా పోటీ పరీక్షలలో మంచి విజయం సాధించవచ్చున్నారు, విద్యార్థులలో దేశ భక్తి మరియు సోదర భావం పెంపొందించేలా చర్యలు తెసుకోవాలన్నారు. కార్యదర్శి ప్రకాష్ బాబు పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం ద్వారా అందించే ఆహారాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లలిత కుమారి , డి.సి. పి. ఓ రాజకుమార్ , లాలచెరువు మున్సిపల్ హై స్కూల్ హెడ్ మాస్టర్ మల్లేశ్వర రావు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా కేసులపై జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి బృందం పరిశీలన



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణంలో డయేరియా కేసుల నమోదైన క్రమంలో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా డిస్ట్రిక్ట్ ఇమ్మ్యూనైజేషన్ అధికారి కె రత్న కుమార్, హెల్త్ సూపర్ వైజర్ సిహెచ్ శ్రీనివాసు, మునిసిపల్ కమిషనర్ జె రామారావు లు పరిశీలించారు. తొలుత ఆసుపత్రిలో చికిత్స పందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య అధికారిణి డా.అమలను అతిసార కేసుల నమోదుపై ఆరాతీశారు. దానికి డా. అమల వివరణిస్తూ కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని, సాధారణ కేసులు మాత్రమే ఆసుపత్రిలో నమోదు అవుతున్నట్టు చెప్పారు. ఈ పరిశీలనలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, పార్టీ కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు

# అన్ని వర్గాల సంక్షేమమే నా అజెండా.. మంత్రి దుర్గేష్

- జల జీవన్ మిషన్ నిధులు దోచేసారు
- 5 సంవత్సరాల్లో రోడ్లపై తట్ట మట్టి వేయలేదు
- సమన్వయంతో పని చేద్దాం
- 30 సంవత్సరాలు పరిపాలిస్తామనే వారు కాలగర్భంలో కలిసి పోయారు
- ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి హాజరైన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

**పెరవలి, మేజర్‌న్యూస్ :** మీ అందరి ఆదరణ అభిమానంతో నిడదవోలు శాసనసభ్యునిగా గెలుపొందిన నాపై నమ్మకం ఉంచి మంత్రి పదవిని ఇచ్చిన జనసేన అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, నిడదవోలు ఎమ్మెల్యేగా తాను గెలుపొందటానికి అహర్నిశలు పాటుపడి తన వెన్నంటే ఉండి నన్ను ముందుకు నడిపించిన నిడదవోలు తెదేపా ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావుకు తాను ఎప్పుడు రుణపడి ఉంటానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జూన్ 27వ తేదీ గురువారం పెరవలి దీపికా ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఎన్నికల్లోప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు. కొత్త ప్రభుత్వం నూతన ఉత్సాహంతో అభివృద్ధి సంక్షేమం రెండు కలిపి రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నామని ఒకపక్క రాజకీయ నాయకులుగా మేము ఎగ్జిక్యూటివ్స్‌గా మీరు ప్రభుత్వ పథకాలను పేద ప్రజలకు అందచేయవలసి ఉంది అన్నారు అందరం కలిసి ఒకే మైండ్ సెట్‌లో పనిచేయాలి అని పిలుపునిచ్చారు మీ స్థాయిలోగ్రామాలలో ఉండే సమస్యలను నా దృష్టికి తీసుకురా వాలని కుల మత పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. చిన్న వ్యాపారులకు ఆసరాగా ఉండటం తప్పనిసరి అన్నారు సీజనల్ వ్యాధులను అరికట్టడానికి హెల్త్‌డిపార్ట్మెంట్ రూరల్ వాటర్ డిపార్ట్మెంట్‌కలిసి పనిచేయాలన్నారు. ఈ సమావేశానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ మండలస్థాయిఅధికారులనుండి గ్రామ స్థాయి ఉద్యోగులవరకుఅందరూ సమన్వ యంతో పనిచేసి నియోజకవర్గాన్ని ప్రగతి పదంలో నడిపిద్దామని అన్నారు. అధికారు లు ఎవరూ తప్పు చేయాల్సిన అవసరం లేదనినిజాయితీగా నిర్భయంగా పనిచేయాలనికోరారు. ఒత్తిడితో కాకుండా స్నేహభావంతో పనిచేసే అవకాశం తమ ఉమ్మడి ప్రభుత్వంలో ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పేదల కష్టాలు తీర్చడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. రెవెన్యూ, విద్యా,ఆరోగ్య, ఉపాధిహామీ, పోలీస్,శాఖలు అధికా రులు సేవాగుణంతో పనిచేయాలనిఆయనకోరారు. ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారి పెరవలి మండలానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ కు మండల తెదేపా నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు కార్యకర్తలు బిజెపి నాయకులు మండలంలోని వివిధ శాఖల అధికారులు అపూర్వ స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కేహిమామహేశ్వరి, తాసిల్దార్ డి సుధ, వెటర్నరీ డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర, డాక్టర్ సల్మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ హేమరాజు డాక్టర్ విజయకుమార్ మండల విద్యాశాఖ అధికారి స్వరూప్ ఎస్సై ఏజిఎస్ మూర్తితోపాటు వివిధ శాఖల అధికారులు వీఆర్వోలు వీఆర్ఏలు ఇతర శాఖల సిబ్బంది మంత్రి కందులకు శుభాకాంక్షలు తెలియజేశారు.





అనంతరం ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారు అని కష్టపడి పనిచేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నిడదవోలు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎన్నికల్లో అధికారం సాధించామని ధీమాతో ఉండకుండా మీ స్థాయిలో గ్రామాల్లో ఉండే సమస్యలు పరిష్కరించాలని పెద్ద సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే తాను పరిష్కరించడానికి కృషి చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు అటికాల శ్రీను మండల జనసేన పార్టీ అధ్యక్షులు పిప్పర రవికుమార్ నాయకులు భూపతిరాజు రవివర్మ బూరుగుపల్లి శ్రీనివాస్ నల్లకుల వెంకటేశ్వరరావు (కోటా శ్రీను) నందిప శ్రీనివాస చక్రవర్తి పసలపూడి భద్రయ్య కోటిపల్లి మురళీకృష్ణ కోలా సీతయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖా మంత్రి లోకేష్‌ని కలిసిన ఐఇఆర్‌టి యూనియన్ నాయకులు



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను కాకినాడ జిల్లా ఐఇఆర్‌టి యూనియన్ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి మంగళగిరిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన సెల్‌ఫోన్‌ల గురించి, ఐఇఆర్‌టి లను రెగ్యులర్ చేయమని ఈ సందర్భంగా కోరినట్లు ఆయన తెలిపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ ఖచ్చితంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని, ఐఇఆర్‌టి యూనియన్ నాయకులు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట పలువురు ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## గ్రామ రెవిన్యూ అధికారులు, రెవిన్యూ సహాయకులకు గౌరవ వేతనం ఇప్పించండి



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** 2004 సాధారణ ఎన్నికలలో విధులలో పాల్గొన్న పి.గన్నవరం నియోజకవర్గంలోని పి.గన్నవరం, ఐనవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు మండలాల గ్రామ రెవిన్యూ అధికారులు మరియు గ్రామ రెవిన్యూ సహకులు తమకు ఎన్నికలలో విదులు నిర్వర్తించినందుకు మాకు గౌరవ వేతనం ఇప్పించమని పి.గన్నవరం తహసీల్దార్ వారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ ఎన్నికలలో మేము వివిధ రకాల విధులకు హాజరైనామని, ఎన్నికలు జరిగి నలభై రోజులు అవుతున్నా ఏవిధమైన టి.ఎ. మరియు డి.ఎ. లు ఇచ్చి ఉండలేదని వినతి పత్రంలో తెలిపారు. కావున మాకు ఇవ్వవలసిన అలవెన్సులు మాకు ఇప్పించి మాకు న్యాయం చేయవలసినదిగా గ్రామ రెవిన్యూ అధికారులు ,రెవిన్యూ సహాయకులు తెలియజేసారు.

## సిరామిక్స్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులకు న్యాయం జరిగే వరకూ వారికిఅండగా ఉంటామని సిఐటియు ఉపాధ్యక్షులు నీలపాల సూరిబాబు అన్నారు. విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. పరిశ్రమ గేటు ముందు సిరామిక్స్ కార్మికులు అర్ధనగ్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ రాక్ సిరామిక్స్ యాజమాన్యానికి కార్మికుల తొలగింపు అనేది అలవాటుగా మారిపోయిందన్నారు. పర్మినెంట్ వర్కర్లను తొలగించి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్లను జాయిన్ చేసుకుంటున్నారన్నారు. గుజరాత్, బీహార్, ఒరిస్సా నుండి కార్మికులను తీసుకువచ్చి కంపెనీ చుట్టుపక్కల ఉండే కార్మికులను విధుల నుండి తొలగిస్తున్నారన్నారు. నష్టాల పేరుతో అబద్దాలు చెబుతూ కార్మిక చట్టాలను అమలు చేయకుండా జాయింట్ లేబర్ కమిషనర్ మాటనుకూడా లెక్కచేయకుండా యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో అన్ని రంగాల కార్మికులతో కలిపి గేటు ముందు ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డి క్రాంతి కుమార్, సామర్లకోట సిఐటియు కార్యదర్శి సురేష్, పెద్దాపురం సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణ, వీర్రాజులు పాల్గొని ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాధిత కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు,అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సప్లిమెంటరీ ఫలితాలలో ఎం.ఎన్.ఆర్ విద్యార్థుల విజయ ప్రభంజనం



అనపర్తి, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో అనపర్తి ఎం.ఎన్.ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ బైపిసి గ్రూపులో ఎన్.యమున 440 మార్కులకు గాను 436 మార్కులతో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంక్, ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను షేక్ సువాన్ బీబీ 463 మార్కులతో రాష్ట్రస్థాయి ఐదవ ర్యాంకు సాధించారని తెలిపారు. ఎంపీసీ గ్రూపులో టి.వినీల దుర్గా మంగాదేవి 460, కే.శ్రావణి 457, వి.గిరిజామాధురి 454, ఎస్.దుర్గా శైలజ 453, కే.నాగేంద్ర కుమార్ 453, ఎం.గణేష్ కుమార్ 452, ఏ.కీర్తి 450, ఏ.సాయి సిద్దు 447, టీ.నవదీప్ రెడ్డి 446, పి.గోపిక ప్రియ 443, జి.గీతహాసిని 442, ఎన్.అఖిలేశ్వర్ 441, టి.సంకీర్తన 440, యితర విద్యార్థులు మంచి మార్కులు సాధించారని, బైపీసీ గ్రూపులో ఎన్.లక్ష్మీ ప్రవల్లిక 427, ఎం.నందిని 413, కె.దీపిక వేణు మాధురి 407, సీఈసీ గ్రూపులో ఎస్.సురేఖ 458, కె.జ్యోతి 456, జి.దేవి ప్రశాంత్ 411 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఎన్.ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ గ్రామీణ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదిగా నిలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యభామ స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్స్ ఎన్.నవీన్, టి.రామభద్రారెడ్డి, ఐఐటి అండ్ నీట్ ఇన్చార్జ్ పి.శివయ్య, సత్యభామ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ ఆమన్ రషీద్ మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## యువత లోకల్ బిజినెస్ నెట్‌వర్క్‌ను జాతీయ స్థాయిలో విస్తరించే చర్యలు చేపట్టాలి






**కాకినాడ, మేజర్ న్యూస్ :** యువత లోకల్ బిజినెస్ నెట్వర్క్ సంస్థను ఏర్పాటు చేయడమే కాకుండా దానిని జాతీయ స్థాయిలో విస్తరించే విదంగా చర్యలు చేపట్టాలని డా. బాదం బాలకృష్ణ, వై.డి. రామారావు, డా. కళ్యాణచక్రవర్తి లు ఆకాంక్షించారు. కాకినాడ మెయిన్‌రోడ్డులో గల రివీస్ రాయల్ ఎంపరర్ మిని ఫంక్షన్ హాల్లో లోకల్ బిజిసెన్ నెట్ వర్క్ సంస్థ ప్రదమ వార్షికోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్.బి.ఎన్. సంస్థ కాకినాడ చాప్టర్ అద్యక్షులు అంకుర్ సురాన అధ్యక్షత వహించగా డా. బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఫౌండర్ డా. బాదం బాలకృష్ణ, రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు, ప్రముఖ వైద్యులు డా. కళ్యాణచక్రవర్తి విశిష్ట అతిధులుగాను, సెంట్రల్ టాక్స్ సూపరిండెంట్లు విజయకుమార్, కమలాకర్రావు, లయన్స్ పాస్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, లయన్స్ క్లబ్ నాయకులు చిట్నీడి శ్రీనివాస్, తలారి రామచంద్రరావు, నడింపల్లి వినోధ్ గౌరవ అతిధులుగా హాజరైయ్యా రు. కార్యక్రమాన్ని అతిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అతిధుల చేతుల మీదుగా లోగోను ఆవిష్కరించారు. అనంతరం ప్రధమ వార్షికోత్సవం కేకును అతిధులు కట్ చేసారు. ఈ సందర్భంగా అతిధులు డా. బాదం బాలకృష్ణ. వై.డి.రామారావు. డా. కళ్యాణచక్రవర్తి, ఎం.వి.విశ్వేశ్వరరావు లు మాట్లాడుతూ యువత ఆలోచనకు పదును పెడితే చక్కటి ఆవిష్కరాలు చేయవచ్చుని అన్నారు. ఎల్.బి.ఎన్.ను దేశవ్యాప్తంగా విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎల్.బి.ఎన్. సెక్రటరీ డా. సిరాజ్, వైస్ ప్రెసిడెంట్ రవితేజా, ట్రెజరర్ ఎ.వి.వి.సతీష్ కుమార్, కమిటి మెంబర్స్ సత్యం, అంకిత్ జైన్, అబ్దుల్ రాజాబ్ సామా సూర్య పెద్ద సంఖ్యలో ఎల్.బి.ఎన్. సభ్యులు పాల్గొన్నారు.

# డయేరియా ప్రబలకుండా పటిష్ట ప్రణాళిక






- కమిషనర్ జె.వెంకటరావు వెల్లడి

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** డయేరియాను అదుపు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టార్ట్ డయేరియా క్యాంపెయిన్ - 2024 కార్యక్రమంపై స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగానికి చెందిన సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30 వరకు ఈ ప్రచార, అవగాహనా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డయేరియా ప్రబలేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో ఇప్పటికే సర్వే చేశామన్నారు.ఆయా ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణి, బాలింతలు ఇతర కేటగిరీలకు చెందిన ప్రజలకు డయేరియా ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎక్కడైనా డయేరియా జాడలు కనిపిస్తే తీసుకోవలసిన ముందస్తు చర్యలపై కూడా అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ చెప్పారు. తమ సర్వే ద్వారా హై రిస్క్ క్యాటగిరి క్రింద 1691మంది గర్భిణీలు,1498మందిబాలింతలు,14,500మందిఐదేళ్లలోపుచిన్నారులను గుర్తించామన్నారు. ఇప్పటికే 5266 కుటుంబాలకు అవసరమైన సహకారాన్ని కూడా అందించామన్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం చేతులను పరిశుభ్రంగా కడగడం, కాచి చల్లార్చిన నీళు వాడడం, వేడి గా ఉండే ఆహారాన్ని భుజించడం, దోమలను అదుపు చేసే చర్యలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత వంటి మురికివాడలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నరసింహ నాయక్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి రత్నకుమార్, కాకినాడ నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వి చరణ్, డిపిఎమ్ఓ డాక్టర్ సురేఖ, పెద్ద ఎత్తున ఐసిడిఎస్ ఉద్యోగులు హాజరయ్యారు.

## అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


- తాజా ఆహారంతీసుకోవాలి - కాచి చల్లార్చిన నీటిని త్రాగాలి
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి - అడిషనల్ డిఎం&హెచ్ఓ డా.సరిత



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువ, ఈ వ్యాధి బారిన పడిన వారు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుందని, కాకినాడ జిల్లా అడిషనల్ డిఎం & హెచ్ఓ డా.సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ అప్రమత్తతే అతిసారకు మందు అని, తాజా ఆహారం తీసుకుంటూ, కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, దీనితో పాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. తాజా వేడి వేడి ఆహార పదార్థాలను భుజించడం వలన ఎంతో ఉపయోగమని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగడం వంటి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని, డా.సరిత సూచించారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆమె ఇలా సూచించారు. ఈ వ్యాధి ప్రబలే కాలంలో క్లోరిన్ కలిపిన నీటినే విధిగా త్రాగాలని, కాచి చల్లార్చిన నీటిని త్రాగడం మంచిదని, కుండ లేక బిందెలలో చేతులు ముంచి ముంచి నీటిని త్రాగరాదని, కాడ గిన్నెతో నీటిని గ్లాసులో పోసుకుని త్రాగడం అలవాటు చేసుకోవాలని, కలుషితమైన నీటిని త్రాగకూడదని, మంచినీటి పైపులైన్ పగుళ్ళను విధిగా రిపేరు చేయించుకోవాలని, మంచినీటిని విధిగా క్లోరినేషన్ చేయాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం అని, చేతి పంపులు, కుళాయిల చుట్టు పళ్లెల ఆకారంలో ప్లాట్‌ఫారమ్‌లు నిర్మించుకోవాలని, వేడి వేడి ఆహారం తినే మంచి అలవాటు చేసుకోవాలని, నిల్వ ఉన్న మాంసాహారం లాంటివి అసలు తినకూడదని, ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని, భోజనానికి ముందు, మల విసర్జన తరువాత విధిగా సబ్బులో చేతులు శుభ్రం చేసుకోవాలని, ఇంటి పరిసరాలతో పాటు, బహిరంగ మల విసర్జన చేయకూడదని ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను వాడటాన్ని అలవాటు చేసుకోవాలని, మంచినీటి చెరువులో, మంచినీటి బావులు, బోర్ల వద్ద బట్టలు ఉతకడం, పశువులను కడగకూడదని, ఇంటి పరిసరాలలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, సూక్ష్మజీవులు చేరకుండి పరిసరాలలో చెత్తకుప్ప, పేడ నిల్వ ఉంచరాదని, ఈగలతో పాటు ఇతర కంటికి కనపడని కీటకాలు సైతంచేరకుండా ఉండేందుకు వంటపాత్రలపై మూతలు ఉంచాలని, కూర గాయాలు, ఫలాలు వినియోగించే ముందు బాగా కడగాలని, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం అని వంటి చేసేముందు, భోజనం వడ్డించే ముందు కూడా సబ్బుతో గోళ్ళతో సహా చేతులను శుభ్రం చేసుకోవాలని, గోళ్ళను ఎక్కువగా పెరగనీయకూడదని, ఏ ప్రాంతంలో అయినా అతిసారా ఉన్నట్లైతే ఆ ప్రాంతం ప్రభుత్వ వైద్యులకు సమాచారం అందించాలని, వెంటనే వైద్యులు తక్షణం స్పందించి, బాధితులకు వైద్య సేవలు అందజేసి రోగులను కాపాడతారని, కావున ప్రజలుపై సూచనలను పాటిస్తూ, ఆరోగ్యవంతంగా ఉండాలని ఆమె తెలిపారు.

## ఇంటర్మీడియట్ - 2024 బెటర్‌మెంట్ ఫలితాలలో సత్తా చాటిన 'ఆదిత్య' విద్యార్థులు

- జూనియర్ ఇంటర్‌లో అత్యధిక మార్కులతో ఆదిత్య జయకేతనం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇంటర్ బోర్డ్ ప్రకటించిన ప్రథమ సంవత్సరం బెటర్‌మెంట్ ఫలితాలలో ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు అద్భుత ఫలితాలతో పాటు అత్యధిక శాతం ఉత్తీర్ణతను సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి విభాగంలో షేక్ ఆసిన్ 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకొన్నారు. అదే విధంగా 467 మార్కులను ముగ్గురు, 466 మార్కులను తొమ్మిది మంది విద్యార్థులు సాధించారు.బైపిసి విభాగంలో పి.మనోహర్, ఎమ్.మణికంఠ రెడ్డి, పి.ఎన్.ఎన్.కుమారి, జి.ఎలిజబెత్ శామ్యూల్, ఎన్.వి.శ్రీవర్షిణి, పి.సింధు, పి.బి.వి.ఎల్. సుహృధి, 440 మార్కులకుగాను 435 మార్కులను ఏడుగురు సాధించారు. అదేవిధంగా 434 మార్కులను ముగ్గురు, 433 మార్కులను నలుగురు, 432 మార్కులను నలుగురు, సాధించారు.ఎంఇసి విభాగంలో జి.మహేశ్వరి, కె.అంజనాదేవి, వి.వి.ఎల్.సంతోషి 500 మార్కులకుగాను 489 మార్కులు ముగ్గురు, 487 మార్కులు ముగ్గురు, 486 మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారు.ఇంటర్ ఫలితాలలో ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులకు ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందనలంద జేసారు. విజేతలు విద్యారంగంలో అనన్య సామాన్యమైన ప్రతిభను కనపరుస్తూ జీవితంలో ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని ఆశిస్తూ ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె.దీపక్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, జూనియర్ కాలేజెస్ కోర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, డైరక్టర్లు ఎస్.వి. రాఘవరెడ్డి, ఎస్.పి.గంగిరెడ్డి, ఐ.ఐ.టి ప్రిన్సిపాల్ జె.మెయినా మరియు ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక గ్రేడ్‌లను సాధించిన విద్యార్థులను, ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

## డయేరియా రోగులకు మానవ హక్కుల సంఘం పరామర్శ



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ గురువారం పరామర్శించారు. వాంతులు, విరోచనాలతో పట్టణానికి చెందిన బ్రౌన్ పేట, కుమ్మరివీది ప్రాంతాలకు చెందిన పలువురు బాధపడుతూ చికిత్స పొందుతుండగా వారి యోగ క్షేమాలను అప్పలకొండ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డా. పి అమలను కలిసి పట్టణంలో అతిసార పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అయితే బుధవారం చేరిన కేసులు తరువాత కొత్తకేసులు నమోదు కాలేదని డా. అమల చెప్పారు. ప్రధానంగా త్రాగునీరు విషయంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలను, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అప్పలకొండ వెంట సంఘం నాయకులు ఎస్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.